# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 02-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ దేశ అభివృద్ధిలో బ్యాంకింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

❖ సెమికాన్ ఇండియా 2025 సదస్సును ప్రధానమంత్రి నరేంద్రమోదీ న్యూఢిల్లీలో ప్రారంభించారు.

❖ భారతదేశం 2014 నుండి పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను ఐదు రెట్లు పెంచిందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ అన్నారు.

❖ రైతుల నుండి పత్తిని సజావుగా కొనుగోలు చేయడానికి కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ కపాస్ కిసాన్ యాప్‌ను ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడులోని చెన్నైలో ఈ రోజు జరిగిన సిటీ యూనియన్ బ్యాంక్ 120వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందన్నారు. దేశ అభివృద్ధిలో బ్యాంకింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. బ్యాంకుల పాత్ర ఆర్థిక లావాదేవీలకు మించి విస్తరించిందని, నేడు బ్యాంకులు సంపదను రక్షించడమే కాకుండా.. అనేక రకాల ఆర్థిక సేవలను అందిస్తున్నాయని వివరించారు. స్థిరమైన అభివృద్ధికి కూడా బ్యాంకులు దోహదపడుతున్నాయని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచం భారతదేశాన్ని విశ్వసిస్తుందని, భారత్ తో కలిసి సెమీకండక్టర్ భవిష్యత్‌ను నిర్మించడానికి సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని యశోభూమిలో మూడు రోజుల పాటు జరిగే సెమికాన్ ఇండియా 2025 సదస్సును ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... భారతదేశంలో

తయారైన అతి చిన్న చిప్ ప్రపంచంలోనే అతిపెద్ద మార్పుకు దారితీసే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. చమురును ఒకప్పుడు నల్ల బంగారం అని పిలిచేవారని, అయితే సెమీకండక్టర్ చిప్స్ ను నేటి ప్రపంచంలో డిజిటల్ వజ్రాలుగా భావిస్తున్నారని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. 21వ శతాబ్దంలో ఈ చిప్స్ కీలకంగా మారనున్నాయని, ప్రపంచ పురోగతిని వేగవంతం చేసే సామర్థ్యం వాటి సొంతమని తెలిపారు. రాబోయే సంవత్సరాల్లో ప్రపంచ సెమీకండక్టర్ మార్కెట్ ఒక ట్రిలియన్ డాలర్లు దాటుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

అదేవిధంగా నేడు ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ ఈ సంవత్సరం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధిని నమోదు చేసి.. అంచనాలను అధిగమించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ  చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం తన స్థిరత్వ లక్ష్యాలకు కట్టుబడి ఉందని, 2014 నుండి పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను ఐదు రెట్లు పెంచిందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన సిఐఐ 20వ గ్లోబల్ సస్టైనబిలిటీ సమ్మిట్‌లో ఆయన ప్రసంగిస్తూ... భారతదేశం నిర్దేశించుకున్న సమయం కంటే చాలా ముందుగానే పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను సాధిస్తోందన్నారు. ఇప్పటికే 50 శాతం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం పొందగలిగిందని వెల్లడించారు. 2030 నాటికి భారతదేశం 500 గిగావాట్‌లను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని పియూష్ గోయల్ పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

కనీస మద్దతు ధర పథకం కింద రైతుల నుండి పత్తిని సజావుగా కొనుగోలు చేయడానికి కేంద్ర జౌళి శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ ఈరోజు కపాస్ కిసాన్ యాప్‌ను ప్రారంభించారు. పత్తి సేకరణ ప్రక్రియలో ఎక్కువ పారదర్శకత, వేగాన్ని తీసుకురావడంతో పాటూ.. రైతులు స్వయంగా నమోదు చేసుకోవడం, స్లాట్ బుకింగ్, చెల్లింపు ట్రాకింగ్ వంటి సదుపాయాలను ఈ యాప్ అందిస్తుంది. పత్తి సాగుదారులకు అమ్మకాలను సులభతరం చేయడంలో ఈ మొబైల్ యాప్ ఒక ప్రధాన అడుగు అని కేంద్రమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ యాప్ బహుళ భారతీయ భాషలలో వినియోగదారులు సులభంగా వాడుకునేందుకు వీలుగా ఉంటుందని గిరిరాజ్ సింగ్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియా మెడ్‌టెక్ ఎక్స్‌పో 2025 రెండవ విడత ఈనెల 4వ తేదీ నుండి న్యూఢిల్లీలో జరగనుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఎక్స్‌పోలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, అంకుర సంస్థలు, పరిశోధనా సంస్థలు, తమ భవిష్యత్ ఆవిష్కరణలను ప్రదర్శిస్తాయి. ఈ కార్యక్రమంలో 30కి పైగా దేశాలకు చెందిన 150 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులు పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్ మూడు రోజుల పాటు భారతదేశంలో పర్యటించేందుకు ఈ రోజు ఢిల్లీ చేరుకున్నారు. ఈ పర్యటన సందర్భంగా సింగపూర్ ప్రధానమంత్రి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుస్తారు. ఈ పర్యటన భారత్-సింగపూర్ దేశాల దౌత్య సంబంధాలను, భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఇరు దేశాల నిరంతర నిబద్ధతను ప్రతిఫలిస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే గురువారం ప్రధానమంత్రితో లారెన్స్ వాంగ్ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీహార్ రాజ్య జీవిక నిధి సాఖ్ సహకారి సంఘ్ లిమిటెడ్‌ను దృశ్య మాధ్యమ విధానంలో ఈ రోజు ప్రారంభించారు. జీవికలో ఉన్న సభ్యులకు సరసమైన వడ్డీ రేట్లకు రుణాలను సులభంగా పొందేలా చేయడమే దీని ప్రధాన లక్ష్యం. ప్రధానమంత్రి 105 కోట్ల రూపాయలను సంస్థ బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని గ్రామీణ మహిళా వ్యాపార వేత్తలు ఇప్పుడు మరింత సులభంగా డబ్బును పొందుతారని చెప్పారు. ఈ ఆర్థిక సహాయం వారి వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకోవడానికి దోహదపడుతుందని ప్రధానమంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

జీఎస్టీ కౌన్సిల్ 56వ  సమావేశం రేపు న్యూఢిల్లీలో జరగనుంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షత వహించనున్నారు. పన్ను రేట్ల హేతుబద్ధీకరణ వంటి జీఎస్టీ సంస్కరణలపై కౌన్సిల్ చర్చించనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఈశాన్య రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలు, కోస్తాంధ్ర, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో రాబోయే 2, 3 రోజుల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (IMD) అంచనా వేసింది. హిమాచల్ ప్రదేశ్‌లో మూడు జిల్లాల్లో రెడ్ అలర్ట్ జారీ చేసింది. మరిన్ని వివరాలను ఐఎండీ శాస్త్రవేత్త రఘు నడింపల్లి వెల్లడిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

యుఎఇలో ఈరోజు జరిగిన ఫుజైరా గ్లోబల్ సూపర్‌స్టార్స్ చెస్ టోర్నమెంట్‌లో ప్రపంచ జూనియర్ ఛాంపియన్ ప్రణవ్ వెంకటేష్ స్పెయిన్‌కు చెందిన గ్రాండ్‌మాస్టర్ అలాన్ పిచాట్‌పై అద్భుతమైన విజయం సాధించి టైటిల్‌ను సాధించాడు. ప్రణవ్ తొమ్మిది పాయింట్లలో 7 పాయింట్లు సాధించి టైటిల్ దక్కించుకున్నాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈనెల 4వ తేదీ నుండి రెండు రోజుల పాటు ఐస్లాండ్ లో పర్యటిస్తారు. ఐస్లాండ్ లో జరిగే ఇండియా-నార్డిక్ ట్రాక్ 1.5 రెండవ విడత చర్చల్లో పాల్గొంటారని, అలాగే ప్రారంభ సమావేశంలో కీలక ప్రసంగం చేస్తారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. డెన్మార్క్, ఫిన్లాండ్, ఐస్లాండ్, నార్వే, స్వీడన్ లను నార్డిక్ దేశాలుగా వ్యవహరిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =